## వైభవంగా వేంకటేశ్వరస్వామికి క్షీరాభిషేకం



**ధర్మపురి, న్యూస్‌టుడే:** పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి మహాక్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, విప్ లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించి చండీ హోమంలో పాల్గొన్నారు. ఈ ఉత్సవం ద్వారా దేవస్థానానికి రూ.13,21,1336 ఆదాయం సమకూరింది. ఆలయ ఈవో శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



జంబిగద్దె వద్ద పోలీస్ అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్పీ

## చట్టాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలి

**జగిత్యాల, న్యూస్‌టుడే:** జిల్లాలో దసరా పండగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆకాంక్షించారు. శనివారం శమి పూజ జరిగే జంబిగద్దెను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా భద్రతాపరంగా తీసుకోవాల్సిన చర్యలపై పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దుర్గామాతా నిమజ్జనాలను సామరస్యంగా జరుపుకోవాలన్నారు. చట్టాన్ని ప్రతిఒక్కరూ గౌరవించాలని.. అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఎస్పీ రఘుచందర్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ ఆరీఫ్‌అలీఖాన్, పట్టణ, గ్రామీణ సీఐలు వేణుగోపాల్, కృష్ణారెడ్డి, ఎస్సై సదాకర్ పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీలోకి 13 వేల క్యూసెక్కుల వరద

**జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే:** శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి శుక్రవారం సాయంత్రం వరకు 13,674 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి ఎస్కేప్ గేట్ల ద్వారా 1,200 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతుండగా.. వరదకాలువకు 4,083 కాకతీయ కాలువకు 6,800 లక్ష్మీ కాలువకు 150 సరస్వతి కాలువకు 500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని వాడుతున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 1091.0 అడుగుల నీటిమట్టంతో 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

## ఆయిల్‌పామ్‌పై ఆసక్తి

### జిల్లాలో 4 వేల ఎకరాలు దాటిన సాగు

న్యూస్‌టుడే, జగిత్యాల ధరూర్‌క్యాంపు

రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్న క్రమంలో జిల్లాలోని చాలా మంది రైతులు ఈ పంటవైపు మళ్లుతున్నారు. జిల్లాలో నాలుగు సంవత్సరాల్లో 32,587 ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకోగా ఇప్పటివరకు 1,660 మంది రైతులు 4,114 ఎకరాల్లో నాటారు. ఈ సంవత్సరం నర్సరీల్లో పెరిగిన మొక్కల లభ్యత ఉండటంతో జనవరి, ఫిబ్రవరి వరకు కూడా పెద్దఎత్తున మొక్కలను నాటే అవకాశముంది. తొలి సంవత్సరం నాటిన మొక్కలు ప్రస్తుతం గెలకు వస్తుండగా త్వరలోనే కాపు కూడా వచ్చే అవకాశముంది.

**ఆయిల్‌పామ్ నాటిన రైతుల సంఖ్య, విస్తీర్ణం**

| సంవత్సరం | రైతులు | నాటినది (ఎకరాల్లో) |
|---|---|---|
| 2022-23 | 670 | 1821.0 |
| 2023-24 | 890 | 2053.0 |
| 2024-25 | 100 | 240.10 |

### రాయితీలు

ఆయిల్‌ఫెడ్ నుంచి అనుమతి పొందిన లోహియా ఎడిబుల్ ఆయిల్ కంపెనీ జిల్లాలోని గొల్లపల్లి మండలంలో నర్సరీని ఏర్పాటుచేసి మొక్కలను రైతులకు అందిస్తోంది. యశ్వంతరావుపేట వద్ద గానుగ పరిశ్రమను ఏర్పాటు చేయనుండగా ఉమ్మడి జిల్లాలో మరో రెండుచోట్ల క్రషింగ్ యూనిట్లను నెలకొల్పనున్నారు. ఆయిల్ పామ్ సాగుకు డ్రిప్, మొక్కలు, నిర్వహణ ఖర్చు తదితరాలకు హెక్టారుకు రూ.50 వేల వరకు రాయితీని నాలుగేళ్లలో ఇవ్వనుండగా ఈ మొత్తాన్ని సకాలంలో విడుదల చేయాలి. క్రషింగ్ యూనిట్ల ఏర్పాటు, ధరస్థిరత్వం ఉండాలని బొంకూరు రైతు దామోదర్‌రావు, అబ్బాపూర్ రైతు రమణారావు తదితరులు కోరారు.

### సాంకేతిక సాయం

మనప్రాంత రైతులకు సాగు అనుభవం లేని పంట కాబట్టి భారత ఆయిల్‌పామ్ పరిశోధనసంస్థ, కంపెనీ శాస్త్రవేత్తలు, ఉద్యాన, వ్యవసాయశాఖల అధికారులు రైతుల తోటలను ఎప్పటికప్పుడు సందర్శించి పురుగులు, తెగుళ్ల నిరోధం, మొక్కల ఎదుగుదలను, అంతరపంటల సాగును తెలుపుతున్నట్లు కంపెనీ సాంకేతిక సలహాదారు డాక్టర్ వై.ఎస్.రంగనాయకులు పేర్కొన్నారు. ప్రస్తుతం వస్తున్న తొలి గెలలను తొలగించి మలి గెలలను కాపునకు మొక్కలను సిద్ధం చేస్తామన్నారు.



గొల్లపల్లి మండలంలోని ఆయిల్‌పామ్ తోట

### విక్రయ సమస్యలు

ధాన్యం, ఆరుతడి పంటల విక్రయ సమస్యలు, మామిడిలో చీడపీడలు, ఇతర పంటల సాగులోనూ వన్యప్రాణుల బెడద, కూలీల కొరత తదితరాలతో జిల్లా రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తిగా ఉండగా గెలల అమ్మకం, ధరల తగ్గుదల, విక్రయ సమస్యలు తలెత్తకుండా చూడాలి. ఆయిల్ పామ్ మొక్కలు నాటిన 5 ఏళ్ల నుంచి ఎకరాకు రూ.42,000 వరకు పంట రుణాన్ని ఇవ్వనుండగా అయిదేళ్ల నుంచి కాకుండా తొలి సంవత్సరం నుంచే రైతులకు పంట రుణాన్ని మంజూరివ్వాలి, పంటలబీమాను వర్తింపచేయాలి. రాయితీని వినియోగించుకుని రైతులు ఆయిల్‌పామ్‌సాగు చేయాలని ఉద్యానశాఖ జిల్లా అధికారి దేవప్రసాద్ తెలిపారు.

## తరగతుల ప్రారంభానికి మోక్షమెప్పుడో?

### ధర్మపురి గిరిజన పాఠశాలపై నీలినీడలు

న్యూస్‌టుడే, ధర్మపురి



నిర్మాణం పూర్తయిన గిరిజన వసతిగృహ భవనం

ధర్మపురి పట్టణంలో గిరిజన ఆశ్రమ పాఠశాల, వసతిగృహాల నిర్వహణకు ఆటంకం ఎదురవుతోంది. గతేడాది రూ.1.70 కోట్ల వ్యయంతో భవనం నిర్మించి ప్రారంభించారు. ఈ ఏడాది విద్యా సంవత్సరంలో ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేసినా.. ఈ భవనాన్ని గుత్తేదారు అప్పగించమని తేల్చి చెప్పడంతో ప్రక్రియకు అడ్డంకి ఏర్పడింది. గుత్తేదారుకు సగం వరకు మాత్రమే బిల్లులు రావడం, మిగిలిన డబ్బులు రాకపోవడంతో ఏర్పాటు ప్రక్రియలో అనిశ్చితి కొనసాగుతోంది.

### నాలుగో గిరిజన ఆశ్రమ పాఠశాలగా..

ధర్మపురికి గిరిజన ఆశ్రమ పాఠశాలను మంజూరు చేస్తూ.. 2023 ఏప్రిల్‌లో ఉత్తర్వులు (ఆర్‌సీ నెం.5684/బి2/2023) వెలువడ్డాయి. దీంతో సంబంధిత అధికారులు వసతులు, సౌకర్యాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నూతనంగా నిర్మించిన భవనంలో 3 నుంచి 10 వరకు తరగతులను నిర్వహించేందుకు ప్రతిపాదలను పంపించగా.. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయి. ఈ ఏడాది ప్రారంభించడానికి సిద్ధపడినా.. గుత్తేదారు అడ్డుపడ్డారు. జిల్లాలో ఇప్పటివరకు బీర్‌పూర్ మండలంలోని తాళ్ల ధర్మారం, మంగెళ, రాయికల్ మండలంలోని బోర్నపెల్లిల్లో గిరిజన ఆశ్రమ పాఠశాలలున్నాయి. ధర్మపురితో నాలుగో గిరిజన ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేసినట్లవుతుంది. త్వరితగతిన గుత్తేదారుకు డబ్బులు చెల్లించి ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

### వచ్చే ఏడాది ప్రారంభిస్తాం

వచ్చే విద్యా సంవత్సరం తప్పకుండా ధర్మపురిలో గిరిజన ఆశ్రమ పాఠశాల తరగతులను నిర్వహించేందుకు కృషి చేస్తాం. ఈ ఏడాది ప్రారంభంలో కొంత సమస్యలు ఎదురయ్యాయి. ఇదే భవనంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. **- ఎల్.సాయిబాబా, జిల్లా ఇన్‌ఛార్జి గిరిజన అభివృద్ధి అధికారి**

## అంజన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

**మల్యాల :** హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కార్తీక్ శుక్రవారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో న్యాయమూర్తికి స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆలయ అధికారులు స్వామివారి శేషవస్త్రంతో న్యాయమూర్తిని సత్కరించి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో అంజయ్య, సూపరింటెండెంట్ హరిహరనాథ్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, స్థానాచార్యులు కపిందర్, ఏఎస్సై శ్రీనివాస్ పాల్గొన్నారు.

# దశ తిరగాలి.. విజయం అందాలి..

## సంకల్పమే ఆయుధంగా ముందుకు సాగాలి



ఈనాడు, కరీంనగర్

**దసరా పండుగ.. విజయానికి ప్రతీక.. ఆత్మవిశ్వాసమే ఆయుధపూజగా విజయ మార్గంలో నడిచేవారికి.. శక్తియుక్తులను కూడగట్టుకుని లక్ష్యం దిశగా అడుగులు వేసేవారికి.. ఏదైనా పనికి శ్రీకారం చుట్టడానికి ఈ పండుగను మించిన మంచి రోజు మరొకటి ఉండదు. ఇదే రోజున శమీ వృక్షాన్ని పూజించిన రాముడు రావణుడిపై గెలిచాడు. దుర్గాదేవి మహిషాసురుడిని యుద్ధంలో ఓడించింది. పాండవులు జమ్మిచెట్టుపై నుంచి ఆయుధాల్ని దింపి వాటితో పోరాటానికి వెళ్లి విజేతలుగా నిలిచారు. ఇదే ఆశతో ఆకాంక్షతో ఉమ్మడి జిల్లావాసులు విజయపథాన నడిచేందుకు సిద్ధమవ్వాలి.. మది నిండుగా శక్తిని నింపుకొని.. సంకల్పాన్ని కూడగట్టుకుని గెలుపు తీరానికి చేరుకోవాలి..**

### రైతన్నా భిన్నంగా సాగు..



వానాకాలం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 6.82 లక్షల మంది అన్నదాతలు దాదాపుగా 10లక్షలకుపైగా ఎకరాల్లో పంటలు సాగు చేయగా.. అందులో అధిక శాతం వరి పంటే వేశారు. ఇక్కడి భూములు కూరగాయలు, వాణిజ్య పంటల సాగుకు అనుకూలమైనా వరిపైనే ఆధారపడుతున్నారు. విజయ దశమి తరువాత యాసంగి సాగు ప్రారంభమవుతుంది. ఇప్పుడైనా కొత్త పంటలు, కొత్త విధానాలతో సాగితే అటు రైతన్నకు.. ఇటు ప్రజలకు మేలు జరుగుతుంది. కూరగాయల సాగు తగ్గి దిగుమతులు లేనప్పుడు అధిక ధరలకు జనం బెంబేలెత్తుతున్నారు. చిరు ధాన్యాల వినియోగంపై ఆసక్తి పెరిగినా ఇక్కడ సాగు లేక ధరలు సామాన్యులకు అందడం లేదు. అధికారులు ఉమ్మడి జిల్లాలో ఏ పంటల సాగు తగ్గడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి.. వాటి సాగు వల్ల కలిగే మేలుపై అవగాహన కల్పిస్తే రైతులకు, ఉమ్మడి జిల్లావాసులకు ఉపయోగపడుతుంది. ఈ క్రమంలో మార్కెటింగ్ సౌకర్యాలు మెరుగుపరచడం అవసరం.

### నైపుణ్య ప్రాప్తిరస్తు

యంగ్ ఇండియా, నైపుణ్యాభివృద్ధిని యువతకు అందించాలనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆశయాలు అందిపుచ్చుకోవాలి. 'యంగ్ ఇండియా'లో భాగంగా సమీకృత గురుకులాలను ఒక రోజు ముందే మంథని, మానకొండూరు నియోజకవర్గాల్లో ప్రారంభించడం శుభ పరిణామం. త్వరలోనే జిల్లాకో కొత్త నైపుణ్య శిక్షణ కేంద్రం, టాస్క్ కేంద్రాలు, ఐటీఐలు ఏర్పాటవనుండటం యువత భవితకు మంచి రోజులనే సంకేతాలిస్తున్నాయి. 38 లక్షల జనాభాలో ఇంటర్ ఆపై విద్యార్హతలున్న వారు దాదాపుగా 3.50లక్షల వరకుంటారు. ప్రస్తుతం ఎంత చదివామన్నది కాదు.. ఎన్ని నైపుణ్యాలున్నాయన్నది ముఖ్యమని యువత గుర్తుంచుకోవాలి. ప్రభుత్వం అందిస్తున్న చేయూతను ఉపయోగించుకోవడంతోపాటు తాము సొంతంగా ప్రస్తుత మార్కెట్‌కు అనుగుణంగా నైపుణ్యాలు పెంచుకోవడంపై దృష్టి పెడితేనే ఉద్యోగులుగా, వ్యాపారవేత్తలుగా ఎదగగలమన్న విషయాన్ని గుర్తించాలి. స్వయం ఉపాధితో పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగడంపై యువత దృష్టి పెట్టినప్పుడే నిరుద్యోగ సమస్య దూరమవుతుంది.

### రేపటి తరానికి దిక్సూచిలుగా నిలిచేలా..

ఎన్నో ఏళ్ల కష్టం ఫలించింది.. దసరా తరవాత ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 800 మందికిపైగా ఉపాధ్యాయులు బడుల్లో అడుగు పెట్టనున్నారు. కలల కొలువు సాధించిన వీరు రేపటి తరానికి దిక్సూచిలుగా నిలిచేలా సాగాలి. మంచి బోధనతోపాటు నైతిక విలువలు నేర్పుతూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే క్రతువు ప్రారంభించాలి. మరోవైపు పోలీసు శిక్షణను పూర్తిచేసుకున్న వారు కొందరు జిల్లాలో అడుగు పెట్టగా.. ఇంకొందరూ ఈ పండుగ తరువాత కొత్త కొలువుల్లో కొలువుదీరనున్నారు. సామాన్యులకు న్యాయం చేయడమే ప్రతి పోలీసు లక్ష్యమైతేనే ఆ దుస్తులకు సార్థకత లభిస్తుందని ప్రతి ఒక్కరూ గుర్తించాలి.

### మహిళా వికాసం..

42వేలకుపైగా స్వయం సహాయక సంఘాల్లోని 5.86 లక్షల మంది మహిళామణులను స్వయం ఉపాధిలో రాణించేలా ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తోంది. ఆ అవకాశాలను ఒడిసిపట్టుకుని విజయం దిశగా సాగాలి. స్త్రీనిధి, బ్యాంకు లింకేజీల రుణాల సహకారం ఆర్థికాభివృద్ధికి దోహదపడాలి. మహిళా శక్తి ద్వారా భిన్న వ్యాపారాలు స్థాపించి స్వయం ఉపాధి పొందాలి. 61 మండలాల్లో ఒక్కో మహిళా సంఘానికి అద్దె బస్సు నిర్వహణ బాధ్యతను అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో మున్ముందు ఆర్థిక స్వావలంబన దిశగా రెట్టింపు ఉత్సాహంతో అతివలు అడుగేయడానికి దసరా వేదిక కావాలి.

### కలల కొలువు సాధించండి



ఈ నెలలో నిర్వహించే గ్రూప్-1 మెయిన్ పరీక్షల్లో విజయం సాధించే దిశగా నాలుగు జిల్లాల్లో దాదాపుగా 4-5 వేల మంది రోజూ పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. గ్రూప్స్ పోటీ పరీక్షలతోపాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగాలను దాదాపుగా 1.24 లక్షల మంది రాశారు. గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలను ఈ ఏడాదిలోనే దాదాపుగా 55 వేల మంది రాయబోతున్నారు. పోలీసు కానిస్టేబుళ్ల నియామకం కోసం కుర్రకారు సిద్ధమవుతున్నారు. విజయ దశమి స్ఫూర్తిగా ఇష్టంగా కష్టపడితే కలల కొలువు సాధించడం పెద్ద కష్టమేం కాదని గుర్తించండి.

# విద్యకు అధిక ప్రాధాన్యం : దుద్దిళ్ల



పాఠశాల భవన శంకుస్థాపన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

**మంథని గ్రామీణం, న్యూస్‌టుడే:** కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని.. ప్రతీ విద్యార్థి సమాజానికి ఉపయోగపడే పౌరుడిగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యం అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. మంథని మండలంలోని అడవి సోమన్‌పల్లి గ్రామంలో 25 ఎకరాల్లో రూ.300 కోట్లతో నిర్మించనున్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్'కు ఎంపీ గడ్డం వంశీకృష్ణతో కలిసి ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లను అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో నాణ్యమైన ఉన్నత విద్యను అందించాలనే ఉద్దేశంతో ఈ గురుకులాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామని గర్వంగా చెబుతున్నామన్నారు. వచ్చే నెల నుంచి ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభిస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి జరగలేదన్నారు. సమీకృత పాఠశాలల్లో కులమత భేదాలు ఉండవని.. అందరికీ సమానంగా విద్య అందించాలనే భావనతో రాష్ట్రంలో ఒకేసారి 28 పాఠశాలలకు శంకుస్థాపనలు చేసినట్లు చెప్పారు. సోమన్‌పల్లి పాఠశాలలో 2026 వరకు భవనాన్ని పూర్తి చేసి రాష్ట్రంలో మొట్టమొదట అడ్మిషన్లు ప్రారంభించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. జిల్లా పాలనాధికారి కోయ శ్రీహర్ష, మంథని మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమా తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ స్థాయిలో బోధనే లక్ష్యం : పొన్నం

**తిమ్మాపూర్, న్యూస్‌టుడే:** గత ప్రభుత్వం కులం, మతం పేరు మీద గురుకులాలు ఏర్పాటు చేసిందని.. వాటికి అతీతంగా అంతర్జాతీయ స్థాయిలో విద్యనందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సమీకృత గురుకులాలను నిర్మించబోతున్నట్లు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల పరిధిలోని యాదవులపల్లిలో శుక్రవారం ఆయన కలెక్టర్ పమేలా సత్పతి, ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం 10 ఏళ్లలో చేసినవి తాము 10 నెలల్లో చేసి చూపించామన్నారు. అర్హత ఉండి రుణమాఫీ కాకపోతే అధికారులను సంప్రదించాలని రైతులకు సూచించారు. గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను బతికించుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక అసమానతలు విద్యతోనే తొలుగుతాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, నాయకులు రమణారెడ్డి, ఎస్ఎల్ గౌడ్, శ్రీనివాస రావు, రాము, లక్ష్మారెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ పమేలా సత్పతి, ఎమ్మెల్యే కవ్వంపల్లి తదితరులు

## బస్సు డ్రైవర్‌కు మూర్ఛ.. అప్రమత్తతతో తప్పిన ముప్పు

**కరీంనగర్ రవాణా విభాగం, న్యూస్‌టుడే:** బస్సు చోదకుడికి మూర్ఛ రావడంతో అప్రమత్తమైన ఆయన బస్సును ఆపేసిన ఘటన కరీంనగర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. రాజన్న సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు (నాన్‌స్టాప్) కరీంనగర్ బస్టాండ్ నుంచి సిరిసిల్లకు వెళ్తుండగా గీతా భవన్ చౌరస్తాలో డ్రైవర్‌కు మూర్ఛ వచ్చింది. అప్రమత్తమైన ఆయన ఆకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. అనంతరం డ్రైవర్‌ను 108కు ఫోన్ చేసి ఆసుపత్రికి తరలించారు. అందులో మరో డ్రైవర్ ఉండటంతో అతను బస్సును తిరిగి కరీంనగర్ బస్టాండ్ వరకు తీసుకెళ్లారు. ఈ ఘటన సమయంలో బస్సులో 20 మంది వరకు ఉన్నారని, వారంత సురక్షితంగా ఉన్నారని ఏటీఎం గుండా సురేశ్ తెలిపారు. డ్రైవర్ క్షేమంగానే ఉన్నారన్నారు.



# అనర్హుల గుర్తింపు.. 5,819 పేర్ల తొలగింపు

**ప్రతి నెలా డీలర్ల వారీగా వివరాలు సేకరణ ■ రేషన్ కార్డుకు ఈ-కేవైసీ తప్పనిసరి**

న్యూస్‌టుడే, హుజూరాబాద్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రేషన్‌కార్డుల్లోంచి అనర్హుల పేర్లను తొలగించే ప్రక్రియ కొనసాగుతోంది. మరణించిన వారు, వివాహం జరిగి అత్తారింటికి వెళ్లిన వారు, స్థానికంగా లేని వారికి బియ్యం పంపిణీ నిలిపి వేయాల్సిందిగా పౌరసరఫరాల శాఖ ఆదేశించింది. ప్రతి నెలా డీలర్ల వారీగా క్షేత్రస్థాయి పరిశీలన చేస్తూ అనర్హులను గుర్తిస్తున్నారు. పక్కదారి పడుతున్న రేషన్ బియ్యాన్ని కట్టడి చేసేందుకే అనర్హులకు బియ్యం పంపిణీ నిలిపి వేసేలా ప్రభుత్వం కచ్చితమైన ఆదేశాలు జారీ చేసింది.

■ ఉమ్మడి జిల్లాలో గత ఫిబ్రవరిలో 9,78,595 రేషన్ కార్డులు ఉండగా 28,13,951 మంది లబ్ధిదారులు ఉన్నారు.

■ అదే అక్టోబరు వచ్చే సరికి 9,77,409 రేషన్ కార్డుల్లో 28,08,132 మంది లబ్ధిదారులున్నారు. ■ తొమ్మిది నెలల వ్యవధిలోనే 1,186 రేషన్ కార్డులను రద్దు చేసి 5,819 మంది లబ్ధిదారుల పేర్లు తొలగించారు. ■ కరీంనగర్ జిల్లాలో అత్యధికంగా 1,075 రేషన్‌కార్డులు రద్దు చేసి 4,192 మంది పేర్లు తొలగించారు. జగిత్యాలలో 787, పెద్దపల్లిలో 406, రాజన్న సిరిసిల్లలో 434 మంది పేర్లు తొలగించారు. ■ ప్రతి నెలా రేషన్ డీలర్ల వారీగా నివేదికలు తెప్పించుకుంటున్న పౌరసరఫరాల శాఖ అధికారులు రేషన్ కార్డుల్లో నమోదైన కుటుంబ సభ్యుల్లో మరణించిన వారు, స్థానికంగా లేని వారిని గుర్తించి వారి పేర్లను తొలగిస్తున్నారు. ■ తొలగించిన వారిలో కొందరు అర్హులు ఉన్నట్లు ఆరోపణలు వస్తుండగా, అలాంటిదేమీ లేదని అధికారులు చెబుతున్నారు. ■ అనర్హుల పేర్లు తొలగించిన పౌరసరఫరాల శాఖ ఈ నెలలో 31.721 మెట్రిక్ టన్నుల బియ్యం తక్కువ చేసి కేటాయించారు.

**తొమ్మిది నెలల్లో వ్యత్యాసం ఇలా..**


| | ఫిబ్రవరి | | అక్టోబరు | |
|---|---|---|---|---|
| జిల్లా | కార్డులు | లబ్ధిదారులు | కార్డులు | లబ్ధిదారులు |
| కరీంనగర్ | 2,77,993 | 8,08,916 | 2,76,918 | 8,04,724 |
| జగిత్యాల | 3,07,158 | 8,82,495 | 3,07,100 | 8,81,708 |
| పెద్దపల్లి | 2,19,677 | 6,25,090 | 2,19,663 | 6,24,684 |
| సిరిసిల్ల | 1,73,767 | 4,97,450 | 1,73,728 | 4,97,016 |



### 3,46,884 మంది ఈ-కేవైసీకి దూరం

అర్హులకే బియ్యం అందేలా ప్రభుత్వం ఈ-కేవైసీని తప్పనిసరి చేసిన విషయం తెలిసిందే. ఏదైనా కుటుంబంలో ఒక లబ్ధిదారుడు ఈ-కేవైసీ ప్రక్రియ చేయకుంటే వారి పేర్లను రేషన్ కార్డుల్లోంచి తొలగించేలా నిబంధన విధించింది. ఇందుకోసం గత నెల 30 వరకు విధించిన గడువును ప్రభుత్వం డిసెంబరు 31 వరకు పొడిగించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 28,08,132 లబ్ధిదారులుండగా ఇప్పటి వరకు 24,61,248 మంది మాత్రమే ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేశారు. ఆధార్ నవీకరణ లేకపోవడం, చనిపోయిన వారి పేర్లు తొలగించకపోవడం, పెళ్లైన యువతులు అత్తారింటికి వెళ్లిపోవడం, కొంత మంది ఉన్నత చదువు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లడం, ఉద్యోగులు స్థానికంగా ఉండకపోవడం తదితర కారణాలతో 3,46,884 మంది ఈ-కేవైసీకి దూరంగా ఉన్నారు. డిసెంబరు 31 లోపు రేషన్ కార్డుల్లో పేరు ఉన్న ప్రతి లబ్ధిదారుడు డీలర్లను సంప్రదించి ఈ-కేవైసీ ద్వారా వివరాలు నమోదు చేయించుకోవాలని, లేని పక్షంలో బియ్యంతోపాటు ఇతర ప్రభుత్వ పథకాలకు అర్హత సాధించే విషయంలో ఇబ్బందులు ఎదురవుతాయని కరీంనగర్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నర్సింగరావు స్పష్టం చేశారు.





వార్డుల వారీగా వివరాలు

# మీ చేతిలోనే ఓటరు జాబితా

**సిరిసిల్ల పట్టణం, న్యూస్‌టుడే:** గ్రామ పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం ఓటరు జాబితా తయారు చేసింది. వార్డుల వారీగా ఓటర్ల వివరాలతో సిద్ధం చేసింది. గత నెలలో ముసాయిదా విడుదల కాగా అభ్యంతరాల స్వీకరణ తర్వాత సెప్టెంబర్ 28న తుది జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది.

### చరవాణిలో చూడొచ్చు...

సాధారణ పౌరులు సైతం ఓటరు జాబితాను చూసేలా రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఇందుకోసం చరవాణి లేదా కంప్యూటర్‌లో గూగుల్ ద్వారా tsec.gov.in అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. అందులో ఫైనల్ రోల్స్ జీపీ అనే మరో ఆప్షన్ కనిపిస్తుంది. దాన్ని క్లిక్ చేయగానే జిల్లా, మండలం, గ్రామ పంచాయతీ వివరాలు ఎంచుకోవాలి. గ్రామానికి సంబంధించిన ఓటర్ల వివరాలు వార్డుల వారీగా కనిపిస్తాయి. ఏ వార్డులో ఎంతమంది ఓటర్లు ఉన్నారు, అందులో మహిళలు, పురుషుల సంఖ్య కనిపిస్తుంది. పక్కనే తెలుగు, ఆంగ్ల భాషలో జాబితా పూర్తి వివరాలతో ప్రత్యక్షమవుతుంది.

## అయిదు రోజుల్లో అక్కడక్కడ వర్షాలు

**జగిత్యాల వ్యవసాయం :** ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రాగల అయిదు రోజుల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడతాయని జగిత్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. ఉష్ణోగ్రతలు కనిష్ఠంగా 23-24 డిగ్రీలు, గరిష్ఠంగా 32-34 డిగ్రీల సెల్సియస్ వద్ద, గాలిలో తేమ 65-93 శాతం వరకు నమోదు అవుతుందని చెప్పారు.

## విజయదశమి శుభాకాంక్షలు

**కరీంనగర్ పట్టణం, న్యూస్‌టుడే:** రాష్ట్ర ప్రజలకు మంత్రి పొన్నం ప్రభాకర్ విజయ దశమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ దుర్గాభవానీ అమ్మవారి ఆశీర్వాదంతో ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, సిరి సంపదలతో ఈ సంవత్సరం ప్రారంభించే అన్ని పనుల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

న్యూస్‌టుడే, ధర్మపురి

? పట్టణంలో ప్రధాన రహదారిపై కొన్ని చోట్ల విద్యుత్తు బల్బులు వెలగడం లేదు. దీనితో అసౌకర్యంగా మారింది. - గంగన్న, ధర్మపురి
✓ వెలుగని విద్యుత్తు బల్బులకు మరమ్మతులు జరిపి, చర్యలు తీసుకుంటాం. - పుర కమిషనర్ బాలె గంగాధర్

? శ్మశాన వాటిక వద్ద చెత్తను పడేస్తున్నారు. దీనితో చేపలు పట్టడానికి వెళ్లిన వారికి ఇబ్బందిగా ఉంటోంది. - గంగపుత్రసంఘం సభ్యులు, ధర్మపురి
✓ డంపింగుయార్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. అది పూర్తయితే చెత్తను పూర్తిగా తొలగింపజేస్తాం.- పుర కమిషనర్ బాలె గంగాధర్

న్యూస్‌టుడే, జగిత్యాల ధరూర్‌క్యాంపు

? పండగలవేళ, ఉక్కబోత సమయంలో గంటల తరబడి విద్యుత్ కోతలతో అవస్థలు పడుతున్నాము. - రాజ్యలక్ష్మి, విద్యానగర్
✓ అత్యవసర మరమ్మతులు, చెట్లకొమ్మల తొలగింపునకుగాను అక్కడక్కడ విద్యుత్ కోతలుంటున్నాయి. పండగలవేళ కోతల్లేకుండా చర్యలు తీసుకుంటాము. - జవహర్‌లాల్‌నాయక్, ఏడీఈ

## లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ ఎల్.రమణ

**జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే:** ఎమ్మెల్సీ ఎల్.రమణ జగిత్యాలలో పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. భారాస పట్టణాధ్యక్షుడు సతీష్, రమణ, సత్యంరావు, మల్లారెడ్డి, తాజొద్దీన్, గంగాధర్, నిరంజన్, శ్రీనివాస్, రాజలింగం పాల్గొన్నారు.

## పలు గ్రామాల్లో సద్దుల బతుకమ్మ


సారంగాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

**సారంగాపూర్, న్యూస్‌టుడే:** సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలు వివిధ రకాల పూలతో అలంకరించిన బతుకమ్మను గ్రామంలో ఒక చోట చేర్చి ఆడిపాడారు. అనంతరం ఊరేగింపుగా వెళ్లి సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు.

## విద్యార్థినులకు నగదు ప్రోత్సాహకం అందజేత

**కోరుట్ల :** రాష్ట్ర వంజరి సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లలో జిల్లా, రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థినులకు రూ.10 వేల చొప్పున శుక్రవారం కోరుట్లలో అందజేశారు. విద్యార్థినులు ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. సంఘం రాష్ట్ర డైరెక్టర్, జిల్లా అధ్యక్షుడు శంకర్, నాయకులు శంకర్, తుకారాం, రాజేందర్, సాగర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు..


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ తదితరులు

**రాయికల్, న్యూస్‌టుడే:** మండలంలోని భూపతిపూర్ గ్రామంలో నిర్వహించిన బీపీఎల్ క్రికెట్ టోర్నీ శుక్రవారం ముగిసింది. యస్.ఆర్ నైట్ రైడర్స్ ప్రథమ, 2008-09 డ్రీమ్ ఛాంపియన్స్ ద్వితీయ స్థానంలో నిలిచాయి. విన్నర్స్, రన్నర్స్ జట్లకు రాయికల్ ఎస్ఐ సుధీర్‌రావు బహుమతులు అందజేశారు. శిక్షణ ఎస్ఐ రవీందర్, సహకార సంఘ అధ్యక్షుడు ముత్యంరెడ్డి, నాయకులు, నిర్వాహకులు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులున్నారు.

**మెట్‌పల్లి:** మండలంలోని బండలింగాపూర్‌లో దసరా ఉత్సవాల సందర్భంగా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో స్థానిక లగాన్ జట్టు గెలుపొందగా.. శుక్రవారం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వీడీసీ ఛైర్మన్ రాజం, సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## దసరా ఏర్పాట్ల పరిశీలన

**మెట్‌పల్లి పట్టణం, న్యూస్‌టుడే:** ప్రతి ఒక్కరు భక్తిశ్రద్ధలతో పాటు స్నేహ భావంగా దసరాను జరుపుకోవాలని మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు కోరారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో జంబి నిర్వహించే స్థలాన్ని డీఎస్పీ బల్దియా కమిషనర్ మోహన్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు ఈ సందర్భంగా డీఎస్పీ చెప్పారు. ఎస్సై చిరంజీవి, బల్దియా డీఈ నాగేశ్వర్‌రావు, ఏఈ తిరుపతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, కౌన్సిలర్ కిషోర్, పుర సిబ్బంది పాల్గొన్నారు.

**ధర్మపురి:** పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శనివారం విజయదశమి సందర్భంగా జరిగే ఉత్సవాలకు విస్తృతమైన ఏర్పాట్లను చేసినట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు. దేవస్థానంలో, జంబి గద్దె వద్ద నిర్వహించే కార్యక్రమాలకు ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ హాజరవుతారని పేర్కొన్నారు.

**కోరుట్ల :** పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం దసరా ఉత్సవాల కోసం అధికారులు ఏర్పాట్లు చేశారు. పురపాలక సంఘం నిధులు రూ.6 లక్షలు వెచ్చించి జంబిగద్దెను ఆధునీకరించారు. జంబిగద్దె వద్ద శమీపూజ నిర్వహణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను కమిషనర్ తిరుపతి, సీఐ సురేశ్‌బాబు, ఎస్సై శ్రీకాంత్ శుక్రవారం పరిశీలించారు. జంబిగద్దె చుట్టూ బారికేడ్లను అమర్చారు. ఆలయం నుంచి శనివారం మధ్యాహ్నం 3 గంటలకు స్వామివారిని అశ్వవాహనంపై శమీపూజ కోసం జబ్బిగద్దె వద్దకు ఊరేగింపుగా తీసుకొస్తారు. అనంతరం శమీపూజ నిర్వహిస్తారు.

## భోజనం వికటించి పలువురికి అస్వస్థత

**జగిత్యాల గ్రామీణం, న్యూస్‌టుడే:** రిసెప్షన్ విందు భోజనం తిని పలువురు అస్వస్థతకు గురైన ఘటన జగిత్యాల గ్రామీణ మండలం గుల్లపేటలో శుక్రవారం జరిగింది. గుల్లపేటకు చెందిన ఓ యువతి వివాహం మల్లాపూర్ మండలం సాతారానికి చెందిన యువకుడితో గురువారం జరిగింది. శుక్రవారం యువతి కుటుంబానికి చెందిన బంధువులు సాతారంలో రిసెప్షన్‌కు హాజరై భోజనం చేశారు. సాయంత్రం ఇంటికి వెళ్లిన అనంతరం పలువురికి వాంతులు, విరేచనాలు కాగా జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అస్వస్థతకు గురైన వారిలో నలుగురు మహిళలు, పిల్లలు, పురుషులతో కలిపి పదిమందికి పైగా ఉన్నారు. వారికి ప్రాణపాయం లేదని వైద్యులు వెల్లడించారు.



## జంబిగద్దె ముస్తాబు

జగిత్యాల పట్టణంలో విజయదశమి సందర్భంగా జంబిగద్దె వద్ద ఏర్పాట్లు పూర్తి చేశారు. మధ్యాహ్నం శమీపూజ నేపథ్యంలో భారీ సంఖ్యలో ప్రజలు రానున్న విషయాన్ని దృష్టిలో ఉంచుకొని భారీకేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. వేణుగోపాలస్వామి ఆలయం నుంచి స్వామివారి పల్లకి సేవ జంబిగద్దె మీదుగా టవర్ పుర వీధుల గుండా సాగుతోంది. అనంతరం జంబిగద్దెపై జరిగే శమీపూజలో అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డీవో మధుసూదన్ తదితరులు పాల్గొననున్నారు. - న్యూస్‌టుడే, జగిత్యాల


చిల్వాకోడూర్: కుంకుమార్చనలో..


ధర్మపురి వీధుల్లో స్వామివారి ఊరేగింపు


మెట్‌పల్లి : టీచర్స్‌కాలనీలో కుంకుమ పూజ

# వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

**మెట్‌పల్లి పట్టణం, జగిత్యాల విద్యానగర్, కోరుట్ల, న్యూస్‌టుడే:** దుర్గా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదవరోజు అయినా శుక్రవారం అమ్మవారు సిద్ధిదాత్రి రూపం, మహిషాసుర మర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి కుంకుమ, ప్రత్యేక పూజలు కొనసాగాయి. పలు గ్రామాల్లో శమీపూజ నిర్వహించి అమ్మవారి విగ్రహాన్ని వాగులో నిమజ్జనం చేశారు.

**సారంగాపూర్ :** బీర్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నవరాత్రుల్లో భాగంగా స్వామివారిని పొన్న చెట్టు సేవలో శుక్రవారం ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకులు వొద్దిపర్తి సంతోషాచార్యులు, మధుకుమారాచార్యులు, చిన్న సంతోషాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం పొన్న చెట్టు వాహనంపై ఉంచి ఊరేగించారు.

**ధర్మపురి :** పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో శుక్రవారం రాత్రి గరుడ వాహనంపై శ్రీ వేంకటేశ్వరస్వామివారి సేవను ఊరేగించారు. అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించగా.. అనంతరం పట్టణ వీధుల్లో స్వామివారి సేవను ఘనంగా ఊరేగించి, ఇసుక స్తంభంలోని మండపం వద్దకు తీసుకువచ్చారు.


కోరుట్ల : మాదాపూర్‌లో విద్యుత్‌కాంతుల వెలుగుల్లో అమ్మవారి ఊరేగింపు

**మల్లాపూర్ :** మండలంలోని మొగిలిపేటలో భవానీమాత దీక్షపరులకు ముస్లిం నాయకుడు మహబూబ్ శుక్రవారం బిక్ష పెట్టారు. 23 సంవత్సరాలుగా హనుమాన్, అయ్యప్ప, శివదీక్ష, భవానీ దీక్షపరులకు బిక్ష పెడుతూ మహబూబ్ ఆదర్శంగా నిలుస్తున్నారు.

**కోరుట్ల, న్యూస్‌టుడే:** పట్టణంలోని పురాతన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి ఆంజనేయ వాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించగా.. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈవో విక్రమ్, పూజారి నర్సింహాచారి పాల్గొన్నారు.


జగిత్యాలలో అమ్మవారు


దీక్షపరులకు భోజనం పెడుతున్న మహబూబ్


ఆంజనేయ వాహనంపై శ్రీవారు

## తాకట్టు పెట్టిన బంగారం ఇప్పించాలని ఆందోళన

**మెట్‌పల్లి, న్యూస్‌టుడే:** తాకట్టుపెట్టిన బంగారం ఇప్పించాలని మెట్‌పల్లి ప్రాంతానికి చెందిన బాధితులు శుక్రవారం ఆందోళనకు దిగారు. వారి వివరాల ప్రకారం.. పట్టణంలోని ఓ ఆభరణాల దుకాణం వ్యాపారి వద్ద పలు గ్రామాలకు చెందిన వారు బంగారు ఆభరణాలు తాకట్టుపెట్టి వడ్డీకి రూ.5 వేల నుంచి రూ.50 వేల వరకు డబ్బు అప్పుగా తీసుకున్నారు. సదరు వ్యాపారి ఇంకో వ్యక్తి వద్ద ఆ బంగారాన్నంతా తాకట్టు పెట్టి వడ్డీకి డబ్బు తీసుకున్నారు. అప్పు తిరిగి చెల్లిస్తామని.. తాకట్టు బంగారం ఇవ్వాలని బాధితులు గత కొన్ని రోజులుగా వ్యాపారిని కోరుతున్నారు. దీంతో శుక్రవారం వారితో కలిసి వ్యాపారి తాను ఆభరణాలు తాకట్టు పెట్టిన వ్యక్తి వద్దకు వెళ్లగా స్పందన లేదు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ బాధితులు అక్కడే జాతీయ రహదారిపై బైఠాయించారు. రాకపోకలకు అంతరాయం కలగడంతో ఎస్సై చిరంజీవి అక్కడకు చేరుకొని ఆందోళన విరమింపజేశారు.

## ఫ్లెక్సీ తొలగించడంపై పోలీసులకు ఫిర్యాదు

**జగిత్యాల, న్యూస్‌టుడే:** జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పేరుతో ఆయన అభిమానులు పాతబస్టాండ్ వద్ద దసరాకు సంబంధించిన ఫ్లెక్సీ ఏర్పాటు చేయగా.. గుర్తుతెలియని వారు తొలగించారు. తొలగించిన వారిపై చర్యలు చేపట్టాలని పట్టణ ఠాణాలో ఎమ్మెల్యే సంజయ్ అభిమానులు శుక్రవారం ఫిర్యాదు చేశారు.

### చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన

**మల్లాపూర్ :** మండలంలోని సిరిపూర్ సహకార సంఘంలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఛైర్మన్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్ష 7వ రోజుకు చేరింది. శుక్రవారం సభ్యులు చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. సంఘానికి చెందిన డబ్బులను వాడుకున్న సీఈవో నుంచి రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

## బస్సు డిపో ఏర్పాటుకు కృషి చేస్తా


ధర్మపురి-హైదరాబాద్ బస్సును ప్రారంభించిన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్


**ధర్మపురి, న్యూస్‌టుడే:** పట్టణంలో రవాణా సమస్యలను పరిష్కరిస్తానే.. రానున్న కాలంలో ఆర్టీసీ డిపో ఏర్పాటుకు కృషి చేస్తామని ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం బస్టాండులో ధర్మపురి నుంచి రోజూ రాత్రి 11.30 గంటలకు హైదరాబాద్‌కు ఏసీ బస్సు సర్వీసును ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. నిత్యం ధర్మపురి పుణ్యక్షేత్రానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తున్నారని, ఇక్కడ డిపో ఏర్పాటుచేస్తే సదుపాయాలు మెరుగవుతాయన్నారు. దీనికి సీఎం రేవంత్‌రెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లు సుముఖంగా ఉన్నారన్నారు. త్వరలోనే వారిని కలిసి నివేదిస్తామన్నారు. జగిత్యాల డిపో మేనేజర్ సునీత, తహసీల్దార్ కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

# అంకితభావంతోనే ప్రభుత్వ బడుల బలోపేతం


నూతన ఉపాధ్యాయులతో పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు

**రాయికల్ పట్టణం, న్యూస్‌టుడే:** ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధన అందేలా కృషి చేయాలని, అంకితభావంతో పనిచేస్తే ప్రభుత్వ బడులు బలోపేతమవుతాయని మండల విద్యాధికారి శ్రీపతి రాఘవులు ఇటీవల ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి సూచించారు. మండల వ్యాప్తంగా ఎంపికైన 23 మంది ఉపాధ్యాయులను పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్ఆర్ గార్డెన్‌లో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఎంఈవో హాజరై మాట్లాడారు. అనంతరం విద్యా రంగ సమస్యలు, ప్రభుత్వ ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవచూపాలని సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనందరావు ఈ సందర్భంగా కోరారు. సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు గంగా రాజం, నర్సయ్య, రాష్ట్ర నాయకులు రమేష్, రవికుమార్, రాజేశం, రాజరెడ్డి, వేణుగోపాల్, శ్రీనివాస్, రాజేందర్‌రావు, మల్లారెడ్డి పాల్గొన్నారు.

# పేదలకు అండగా సీఎం సహాయనిధి


చెక్కులు పంపిణీ చేస్తున్న జీవన్‌రెడ్డి

**జగిత్యాల, న్యూస్‌టుడే:** ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. జగిత్యాల నియోజకవర్గంలోని పలు గ్రామానికి చెందిన 208 మందికి రూ.59.18 లక్షల విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. పేదలకు వైద్య ఖర్చులు భారం కాకూడదని ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.10 లక్షలకు పెంచారన్నారు. ఆరోగ్యశ్రీలో అన్ని రకాల వ్యాధులకు ఉచిత వైద్య సౌకర్యం ఉన్నప్పటికీ కొందరు అవగాహన లేక ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి ఆర్థికంగా చితికిపోతున్నారన్నారు. అత్యవసరంలో నిమ్స్‌లో ఎల్ఓసీ ద్వారా వైద్యం పొందేవీలుందని తెలిపారు. అనంతరం రతన్ టాటా మృతికి సంతాపం వ్యక్తం చేశారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మహేష్, నాయకులు శంకర్, అశోక్, గంగారెడ్డి, మోహన్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## బల్దియా కమిషనర్‌కు ఎమ్మార్పీఎస్ విన్నపం

**జగిత్యాల విద్యానగర్ :** జగిత్యాల పట్టణం కోర్టు సమీపంలోని ఓ మిఠాయి దుకాణంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం పుర కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఎక్కువ కాలం నిలువ ఉంచిన పదార్థాలు విక్రయిస్తున్నారని, పరిశుభ్రత పాటించడం లేదని ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గంగారాం, ఉపాధ్యక్షుడు కిషన్, కోకన్వీనర్ సునీల్, నాయకుడు సతీష్ పాల్గొన్నారు.

## బోనస్ అని బోల్తా కొట్టించి.. రూ.60 వేలు స్వాహా

**కోరుట్ల, న్యూస్‌టుడే:** గుర్తుతెలియని వారు ఫోన్ చేసి బోనస్ వచ్చిందని నమ్మించడంతో వారు చెప్పినట్లు విని ఓ వ్యక్తి రూ.60 వేలు పోగొట్టుకున్న ఘటన కథలాపూర్ మండలంలోని ఓ గ్రామంలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బాధితుడికి గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి ఎల్ఐసీ పాలసీ బోనస్ మీ ఖాతాలో కొంత మొత్తం జమ అయిందని.. మిగిలిన డబ్బులు జమ చేయాలంటే తాను పంపే లింకు తెరచి చెప్పినట్లు చేయాలన్నాడు. బాధితుడు నమ్మి నిందితుడు చెప్పినట్లు చేయడంతో కొద్దిసేపటికి అతని ఫోన్‌పే ఖాతా నుంచి రూ.60 వేలు పోయాయి. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు వెంటనే సైబర్ క్రైం టోల్ ఫ్రీ నంబర్‌కు.. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**గొల్లపల్లి:** ఆర్థిక ఇబ్బందులతో ఈ నెల 9న మనస్తాపం చెంది పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన గొల్లపల్లికి చెందిన గడ్డం జలంధర్‌రెడ్డి(38).. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## గుడుంబా స్వాధీనం.. కేసు నమోదు

**బీమారం :** మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన జంగిలి నర్సయ్య ఇంట్లో శుక్రవారం 5 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్.ఐ శ్యామ్‌రాజ్ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ చెప్పారు.

## బంగారం, నగదు చోరీ

**జగిత్యాల, న్యూస్‌టుడే:** పట్టణంలోని అరవింద్‌నగర్‌లో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఉపాధ్యాయుడు తిరుమల్‌రావు ఇంటికి తాళం వేసి స్వగ్రామానికి వెళ్లి శుక్రవారం వచ్చి చూసేసరికి ఎనిమిది తులాల బంగారం, రూ.50 వేల నగదు మాయం అయ్యాయి. తిరుమల్‌రావు ఫిర్యాదుతో పట్టణ ఎస్.ఐ కిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చెక్కుల పంపిణీ

**సారంగాపూర్ :** మండలంలోని రంగపేట, కోనాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాల్లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పూజలు చేశారు. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని అర్పపల్లి, తుంగూర్‌తోపాటు పలు గ్రామాల్లో సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. జితేందర్, పూర్ణచందర్‌రెడ్డి, సుధాకర్, రవి, రాజిరెడ్డి, పాల్గొన్నారు.

## సంఘాలు-నియామకాలు

**కొడిమ్యాల :** మండలంలోని శ్రీరాములపల్లె రెడ్డి సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలను శుక్రవారం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా కొరండ్ల నరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా దొర్నాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎడపెల్లి నవీన్‌రెడ్డి, డైరెక్టర్లుగా మొహన్‌రెడ్డి, కేశవరెడ్డి, జలపతిరెడ్డి, సాయిక్రిష్టారెడ్డి, అశోక్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శివారెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## రోడ్డుపై గుంతలు పూడ్చిన యువకులు

**మల్యాల :** మండలంలోని నూకపల్లి శివారులో జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారిపై ఉన్న వరద కాలువ వంతెన వద్ద తారు లేచిపోయి గుంతలు ఏర్పడ్డాయి. గుంతలతో ప్రయాణికులు ఇబ్బందులు పడటం గుర్తించి నూకపల్లి యువకులు శుక్రవారం మట్టితో గుంతలను పూడ్చివేశారు. శ్రీనివాస్, శేఖర్, శ్రీకాంత్, మహేష్, ప్రశాంత్, సురేష్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ

**మల్యాల :** ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ శుక్రవారం మల్యాల మార్కండేయ గుడి వద్దగల దుర్గాదేవిని దర్శించుకున్నారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ నాయకులు ఆదిరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

## అటవీశాఖ కార్యాలయంలో విందు

**జగిత్యాల, న్యూస్‌టుడే:** జగిత్యాల అటవీ శాఖ కార్యాలయంలో కొందరు ఉద్యోగులు శుక్రవారం రాత్రి విందు చేసుకున్నారు. విషయం తెలియడంతో విలేకరులు వెళ్లి చూసేసరికి పలువురు జారుకోగా మరికొందరు దురుసుగా ప్రవర్తించారు. విందులో ఉద్యోగులు మద్యం కూడా తాగారు.



